సాక్షి
వికారాబాద్
మంగళవారం । 13 । ఆగస్టు । 2024



మళ్లీ యూరియా లొల్లి!

రైతుల అవసరాలను కొంతమంది ఫెర్టిలైజర్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. 8లో▸



బాధితులకు అండగా..

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోందని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రామ్ రెడ్డి తెలిపారు. 8లో▸



నిర్మించారు.. వదిలేశారు!

ఉపాధి హామీ పథకం కింద జీపీలకు నూతన భవనాలు నిర్మించారు. పనులు పూర్తయినా వాటిని ప్రారంభించడం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

- ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల కార్గో, లాజిస్టిక్ మార్కెటింగ్ ఆఫీసర్ రవీందర్



దాదాపూర్‌లో కార్గో సేవలను ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

దోమ: ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల కార్గో, లాజిస్టిక్ మార్కెటింగ్ ఆఫీసర్ ఎం రవీందర్ కోరారు. సోమవారం దోమ మండలం దాదాపూర్‌లో టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్, కార్గో సేవలను గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ సేవలు పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్గో సేవలపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని గడిసింగాపూర్ బస్టాప్ పక్కన లాజిస్టిక్ కౌంటర్‌ను ఏర్పాటు తెలిపారు. కౌంటర్ ఏజెంట్‌గా ఎల్ విజయ్‌కుమార్‌ను నియమించామన్నారు. కార్యక్రమంలో పరిగి, వికారాబాద్, తాండూరు కార్గో సెల్స్ సభ్యులు విశ్వనాథ్, వసంత్, చంద్రయ్య, భాను, ప్రసాద్, లాజిస్టిక్ ఏజెంట్ కే శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కృష్ణ, మాజీ ఉప సర్పంచ్ గఫార్, మాజీ వార్డు సభ్యుడు రమేశ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గురుచరణ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శేఖర్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ప్రాతిపదికన వైద్యుల పోస్టుల భర్తీ

అనంతగిరి: వికారాబాద్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన డాక్టర్లు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అనంతగిరి గుట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అనాటమీ విభాగంలో ప్రొఫెసర్ పోస్టు -1, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు-1, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు -1, సైకాలజీ విభాగంలో అసోసియేటెడ్ ప్రొఫెసర్ పోస్టు -1, ఫార్మాకాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు-1, పాథాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు-1, మైక్రో బయాలజీలో ప్రొఫెసర్ పోస్టు-1, ఫారెన్సిక్ మెడిసిన్‌లో ప్రొఫెసర్ పోస్టు-1, అసోసియేటెడ్ ప్రొఫెసర్ పోస్టు-1 కమ్యూనిటీ మెడిసిన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు-3 ఖాళీ ఉన్నాయని తెలిపారు. జనరల్ మెడిసిన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు - 2, డెర్మటాలజీలో ప్రొఫెసర్ పోస్టు 1, సైక్రియాట్రీలో అసోసియేటెడ్ ప్రొఫెసర్ పోస్టు -1, జనరల్ సర్జరీలో అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టు -1, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు- 2, ఈఎన్‌టీలో ప్రొఫెసర్ పోస్టు -1, గైనకాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు నాలుగు, డెంటల్‌లో ప్రొఫెసర్ పోస్టు -1, అసోసియేటెడ్ ప్రొఫెసర్ పోస్టు -1, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు -1 ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు httpr://fmcvikarabad.orfలో సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ధారూరు: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌సింగ్ డిమాండ్ చేశారు. గతంలో ధారూరుకు చెందిన ఏడుగురు మృతి చెందడంతో సోమవారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబ సభ్యులు ఆసరా లేకుండా పోయిందన్నారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఎస్ఎస్ఏను విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

చదువు.. సంకటం



జిల్లాలో భారీగా ఉపాధ్యాయ ఖాళీలు

- భర్తీకి నోచుకోని పోస్టులు 1,300పైనే..
- వలంటీర్ల నియామకంలోనూ మీనమేషాలు
- బోధనపై తీవ్ర ప్రభావం
- ఏటా పడిపోతున్న ఉత్తీర్ణత శాతం
- రెండేళ్లుగా మన జిల్లాది చివరి స్థానమే
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

వికారాబాద్: పాఠశాల విద్య నానాటికి తీసికట్టుగా తయారవుతోంది. చాలా కాలంగా టీచర్ పోస్టుల నియామక ప్రక్రియకు బ్రేక్ పడటంతో పాఠశాలల్లో ఖాళీలు పేరుకుపోయాయి. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియతో ఖాళీల సంఖ్య మరింత పెరిగింది. దీనికి తోడు గత ప్రభుత్వం విద్య వలంటీర్ వ్యవస్థకు స్వస్తి పలకడంతో బోధన గాడి తప్పుతోంది. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసే దాకా వలంటీర్లను నియమించుకోవాలని ఇటీవల ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో మాత్రం 52మంది విద్యా వలంటీర్లను నియమించుకునేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 1,032 పాఠశాలలు ఉండగా 3,700 ఉపాధ్యాయులు, 85,000 మంది విద్యార్థులు ఉన్నారు. 1,300 వరకు టీచర్ ఖాళీలు ఉండగా ఉన్నాయి. దీంతో ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లేక ఆ ప్రభావం పైతరగతులకు వెళ్లాక ఫలితాలపై పడుతోంది. ఇప్పటికే పదో తరగతి ఉత్తీర్ణతలో జిల్లా అట్టడుగు స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఖాళీల నేపథ్యంలో భవిష్యత్‌లో మరింత ప్రభావం పడే అవకాశం లేకపోలేదు.

ప్రాథమిక స్థాయిలో..

ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందే ప్రక్రియ కూడా పూర్తయిన నేపథ్యంతో ఉన్నత పాఠశాలల్లో భాషా పండిట్లు మినహా సబ్జెక్టు టీచర్ల కొరత కూడా తీరింది. అయితే ఈ పదోన్నతుల సమయంలో ఒకే టీచర్ రెండు మూడు సబ్జెక్టుల్లో పదోన్నతి పొందేందుకు అర్హత సాధించగా వారు చివరకు ఏదో ఒక సబ్జెక్టును ఎంచుకుని జాయిన్ అయ్యారు. దీంతో మిగతా స్థానంలో ఖాళీలు అలాగే ఉండిపోయాయి. ఇదే సమయంలో జిల్లాలో గ్రేడ్ టు భాషా పండితులు గ్రేడ్ వన్ పండిట్లుగా పదోన్నతి పొందారు. ఇందులో అత్యధికంగా తెలుగు గ్రేడ్ టు పండిట్లు 159 మంది, హిందీ గ్రేడ్ టు పండిట్లు 149 మంది గ్రేడ్ వన్ పండిట్లుగా పదోన్నతి పొందారు. డీఎస్సీ ద్వారా ఆ పోస్టులు భర్తీ చేసే వరకు గ్రేడ్ టూ తెలుగు, హిందీ పండిట్ పోస్టులు ఖాళీలు ఉండనున్నాయి. దీంతో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కూడా ప్రస్తుతం మూడు వందలకు పైగా ఖాళీలు ఏర్పడ్డాయి. అయితే ఈ పదోన్నతుల ప్రభావం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలపై ఎక్కువగా పడింది. చాలా వరకు ప్రాథమిక పాఠశాలలు ఖాళీ అయ్యాయి. డీఎస్సీ నిర్వహించి ఖాళీలన్నీ భర్తీ చేసే వరకు ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీలు అలాగే ఉండనున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 649 మంది ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా, ఎల్ఎఫ్ఎల్ పదోన్నతి పొందుతున్నా రు. దీంతో జిల్లాలో ఎస్జీటీలకు సంబంధించి 649 పోస్టులు ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా మారాయి. వీటితో పాటు గతంలోనూ ప్రాథమిక పాఠశాలల్లో 360 పోస్టులు ఖాళీలు ఉన్న నేపథ్యంలో జిల్లాలో వెయ్యికిపైగా ఎస్జీటీ పోస్టులు ఖాళీగా మారనున్నా యి. ఉన్నత పాఠశాలల్లో సైతం 350 వరకు ఖాళీలు ఉన్నాయి.

వలంటీర్లు లేకపోవడంతో..

డీఎస్సీ ద్వారా ఖాళీలు భర్తీ చేసే వరకు అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పేరుతో స్కూళ్లలో వలంటీర్లను నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించడం స్వాగతించే విషయమే. అయితే ఈ ప్రక్రియకు సంబంధించి పాఠశాలలకు ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని హెచ్‌ఎంలు అంటున్నారు. ఇటీవల డీఎస్సీ పరీక్ష పూర్తి చేసిన ప్రభుత్వం ఇంకా ఫలితాలను విడుదల చేయలేదు. రిజల్ట్ వచ్చి నియామకాలు చేపట్టినప్పటికీ జిల్లాలో వెయ్యికి పైగా పోస్టులు ఖాళీగా ఉండనున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభమై రెండు నెలలు దాటినా ఖాళీల స్థానంలో వలంటీర్లను నియమించకపోవడం సరి కాదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. వెంటనే వలంటీర్లను నియమించి పాఠశాల విద్యను గాడిన పెట్టాలనే డిమాండ్ చేస్తున్నారు.

కొడంగల్ నియోజకవర్గానికి ఊరట

బొంరాస్‌పేట/కొడంగల్ రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సోమవారం బొంరాస్‌పేట, కొడంగల్, దౌల్తాబాద్, దుద్యాల్ మండలాల్లో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించుకోవాలని ఆదేశాలు అందాయి. దీంతో ఆయా ఉన్నత పాఠశాలల్లో 52మంది వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువడింది. ఒక్కో ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.15,600 గౌరవ వేతనం ఇవ్వనున్నారు.

బొంరాస్‌పేట మండలంలో..

రేగడిమైలారం జెడ్పీహెచ్ఎస్‌కు ఆరుగురు అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు, ఏర్పుమళ్ల, మహంతీపూర్, కొత్తూరు, ఎన్కేపల్లి యూపీఎస్‌లకు ఒక్కొక్కరు చొప్పున నియమించనున్నారు.

కొడంగల్ మండలంలో..

కొడంగల్ జెడ్పీహెచ్ఎస్(బాలికలు) ఇద్దరు, రుద్రారం జెడ్పీహెచ్ఎస్ ఒకరు, పర్సాపూర్ యూపీఎస్‌కు ఒకరు, హస్నాబాద్, అంగడిరాయిచూర్ యూపీఎస్(ఉర్దూ మీడియం)లకు ఒక్కరు చొప్పున, టేకుల్‌కోడ్, అన్నారం, ఇందనూర్ ఒక్కొక్కరు, కస్తూర్‌పల్లి యూపీఎస్‌కి ఇద్దరిని నియమించనున్నారు.

దౌల్తాబాద్ మండలంలో..

దౌల్తాబాద్ జెడ్పీహెచ్ఎస్‌కు ఒకరు, బిచ్చాల్ జెడ్పీహెచ్ఎస్‌కు నలుగురు, బాలంపేట జెడ్పీహెచ్ఎస్‌కు ముగ్గురు, తిమ్మారెడ్డిపల్లి, నీటూరు, సుల్తాన్‌పూర్ యూపీఎస్‌లకు ఇద్దరు చొప్పున, మాటూరు యూపీఎస్‌కు ముగ్గురు, దేవరఫస్లావాద్, గుండాల్ యూపీఎస్‌లకు ఒకరు చొప్పున, దౌల్తాబాద్ యూపీఎస్(ఉర్దూ మీడియం) ఒకరిని నియమించనున్నారు.

దుద్యాల్ మండలంలో..

హకీంపేట, చిల్మల్‌మైలారం యూపీఎస్‌లకు ముగ్గురు చొప్పున, అల్లిఖాన్‌పల్లి యూపీఎస్‌కు ఇద్దరు చొప్పున, దుద్యాల్ యూపీఎస్(ఉర్దూ మీడియం), హస్నాబాద్ యూపీఎస్(ఉర్దూ మీడియం), లగచర్ల యూపీఎస్‌కు ఒక్కరు చొప్పున మొత్తం 52మంది అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు.

పనుల్లో వేగం పెంచండి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై సమీక్ష

అనంతగిరి: అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. సోమవారం జిల్లా సమాఖ్య భవన్‌లో మండలాల వారీగా పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను దుర్వినియోగం కారాదన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే పనులను చేపట్టాలని ఆదేశించారు. స్కూల్ వారీగా తాగు నీరు, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్, ఇతర మరమ్మతు పనులకు సంబంధించిన ఖర్చుల వివరాలను పంపాలన్నారు. గ్రామీణాభివృద్ధి సౌజన్యంతో స్కూల్ యూనిఫాం తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. సకాలంలో విద్యార్థులకు యూనిఫాం అందాలన్నారు. అనంతరం పాఠశాలలకు చేరిన లైట్లు, ఫ్యాన్లను పరిశీలించారు. సమావేశంలో డీఆర్‌డీఏ శ్రీనివాస్, అడిషనల్ డీఆర్‌డీఓ సరోజ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అలివేలు, ఐకేపీ సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

సత్వరమే పరిష్కరించాలి

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై 150 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి, భూ సర్వే, ఆసరా పెన్షన్ల కోసం ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రభుత్వానికి అర్హుల జాబితా

రెండు విడతల్లో మాఫీకి నోచుకోని 2,368 మంది రైతులు



తాండూరు ఎస్‌బీఐ వద్ద రుణమాఫీ కోసం రైతుల క్యూ(ఫైల్)

సాక్షి ఎఫెక్ట్..

- మూడో విడతలో పథకం అమలయ్యే అవకాశం

బషీరాబాద్: రెండు విడతల్లో రుణమాఫీకి నోచుకోని రైతుల జాబితాను జిల్లా అధికారులు సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన జాబితాను ప్రభుత్వానికి పంపారు. ఈ నెల 11న సాక్షి దినపత్రికలో మాఫీ ప్లీజ్ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారులు బాధిత రైతుల వివరాలు సేకరించారు. రెండు విడతల్లో రుణాలు మాఫీ కానీ రైతులు 2,368 మంది ఉన్నట్లు తేల్చారు. వారికి పథకం వర్తింపజేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపారు. మూడో విడత జాబితాలో వీరి పేర్లు ఉండే అవకాశం ఉంది. జిల్లాలో మొదటి, రెండో విడతలో 73,071 మంది రైతులకు రూ.521.97 కోట్ల పంట రుణాలు మాఫీ అయ్యాయి. మూడో విడత 14వ తేదీ అమలు చేసే అవకాశం ఉంది. చివరి విడతలో 25 వేల మంది రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. జిల్లాలో 2.97లక్షల మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు 73 వేల మందికి మాత్రమే మాఫీ వర్తించింది.



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయే

- స్థానిక ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించాలి
- బీఆర్ఎస్ పార్టీ ఇక ముగిసిన అధ్యాయం
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


కుల్కచర్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం ఇక బీజేపీయేనని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం కుల్కచర్ల మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీపై ఇప్పటికీ ప్రజల్లో వ్యతిరేకత ఉందని, నాటి నిరంకుశ పాలనే ఇందుకు కారణమన్నారు. నిరుద్యోగుల జీవితాలను నాశనం చేశారని ఆరోపించారు. ఇక బీఆర్ఎస్ పార్టీ ముగిసిన అధ్యాయమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై సమస్యలపై పోరాటం చేయాలని కార్యకర్తలకు సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు ప్రజాప్రతినిధులుగా మారాలని ఆకాంక్షించారు. ప్రతి గ్రామంలో బీజేపీ తరఫున అభ్యర్థి పోటీలో ఉండాలన్నారు. గ్రామాలకు కేంద్రం ఇస్తున్న నిధుల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రహ్లాదరావు, మిట్టా పరమేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షులు జెమిని సూర్యకాంత్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు జానకిరాం చౌహాన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మైపాల్, మండల ప్రధాన కార్యదర్శి హన్మంతు, చౌడాపూర్ మండల అధ్యక్షులు బందయ్య, కుల్కచర్ల బీజేవైఎం మండల అధ్యక్షుడు మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో.. 'మోడల్' విద్యార్థులు

మహేశ్వరం: మహేశ్వరం మోడల్ స్కూల్‌లో (2023–24) ఇంటర్ పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థులు ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఐఐఐటీలో సీట్లు సాధించారు. మునావత్ సిద్ధు త్రిపుర రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీ అగర్తలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో, కాట్రావత్ శివ మణిపూర్ రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీ ఇంఫాల్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో సీటు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ్ మాట్లాడుతూ.. తమ విద్యార్థులు దేశంలోని ప్రముఖ యూని వర్సిటీల్లో ఐఐఐటీ సీట్లు సాధించడం గర్వంగా ఉందన్నారు. తోటి విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆయా సబ్జెక్టుల్లో శిక్షణ ఇస్తూ.. వారి సందేహాలను నివృత్తి చేస్తూ.. విలువైన సూచనలిస్తూ విద్యార్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులను అభినందించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

శంకర్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు అంజన్‌కుమార్, కంజర్ల ప్రకాశ్ అన్నారు. సోమవారం శంకర్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ గార్డెన్స్‌లో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీ కోసం పని చేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. పదవులు రావాని ఎవరూ అధైర్యపడొద్దన్నారు. అదేవిధంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేసి మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవడమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చిన్నచిన్న పొరపాట్లు ఉంటే సరిచేసుకొని ముందుకుసాగాలన్నారు. సమావేశంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాములు, వాసుదేవ్ కన్నా, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



బోరు మోటార్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం రాసుమల్లగూడ వాసుల అభ్యర్థన మేరకు గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయానికి ఆయన సొంత డబ్బులతో బోరు మోటారును అందజేశారు. అమర్చిన మోటారును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీని గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధవి రంగయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భీష్వరామకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ యాదయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగభూషణ్, మాజీ వార్డుసభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ సదస్సును జయప్రదం చేయాలి

ప్రజా సంఘాల నాయకుల పిలుపు

కొడంగల్ రూరల్: పట్టణంలోని రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నేడు (13వ తేదీ) నిర్వహించనున్న భూ సదస్సును జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వారు మాట్లాడారు. ఫార్మా కంపెనీ పేరుతో హకీంపేట, లగచర్ల, పోలేపల్లి, పులిచర్లతాండ, రోటిబండ తండా, ఎరన్‌పల్లి గ్రామాల్లో 74 ఎకరాలు మెడికల్, నర్సింగ్ కాలేజ్ నిర్మాణం పేరుతో సేకరించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 1,154 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి అన్యాక్రాంతం అయ్యాయని, అధికారులు వాటి జోలికి పోకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌తో ఏర్పడిన భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు కే చంద్రయ్య, అంబేడ్కర్ తాలూకా అధ్యక్షుడు రమేష్‌బాబు, కొత్తురు బలరాం, శ్రీనివాస్, అనంతయ్య, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు